**కథ**

# సెలెక్షన్

**ఉ**దయం ఎనిమిదిన్నరకు పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఒంగోలు స్టేషన్నుంచి కదులుతుండగా అరవై సంవత్సరాల వృద్ధుడో కడు హడావిడిగా కంపార్ట్‌మెంట్లోకి ఎక్కాడు.

ఆ కంపార్ట్‌మెంట్లో దాదాపు అన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయి. పదిమంది మించి ప్రయాణీకులు లేరు. అడిగేవారు లేకపోవడంతో ఆ పదిమందీ హాయిగా సీట్లలో పడుకున్నారు.

రాకేష్, రమేష్ ఎదురెదురు సీట్లలో కాళ్ళు బార్లాజాపుకుని కూర్చుని దిలాసాగా సిగరెట్లు తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

వృద్ధుడు వారికి కుడివైపున ఉన్న సింగిల్ సీట్లో కూర్చుని కిటికీలోంచి తొంగిచూస్తున్నాడు. ఖద్దరు బనియన్, ముతక ధోవతీ ధరించాడు. చింపిరి జుట్టుతో పక్కా పల్లెటూరి రైతులా ఉన్నాడు. కొంచెం నీరసంగా కనిపిస్తున్నాడు.

రాకేష వృద్ధుడి వంక ఎగాదిగా చూశాడు.

''ఎక్కడిదాకా తాతా'' అడిగాడు.

''మద్రాసు బాబూ'' చెప్పాడా వృద్ధుడు.

''అయ్యో..మద్రాసా? మరి ఈ బండెక్కావే?'' కంగారుగా అన్నాడు రమేష్.

''అదేంటి బాబూ..ఈ బండి మద్రాసు పోదా?'' ఆందోళనగా అన్నాడు వృద్ధుడు.

''లేదయ్యా బాబూ..ఇది చెన్నై వెళ్తుంది'' నవ్వుతూ చెప్పాడు రమేష్.

కంగారుగా లేచాడు వృద్ధుడు.

''అయ్యో..కండక్టరూ..ఆపవయ్యా. బండాపు. ఓల్డాన్..ఓల్డాన్..'' అరిచాడు.

రమేష్, రాకేష పగలబడి నవ్వారు.

''బాబ్బాబూ..మీకు దండం పెడతాను. కొంచెం ఆ గొలుసు లాగండయ్యా..పుణ్యం ఉంటుంది. బండి ఆపించండి'' ప్రాధేయపడ్డాడు వృద్ధుడు.

మళ్ళీ నవ్వారు రమేష్ రాకేష్‌లు.

''గొలుసు లాగితే ఐదు వందల రూపాయలు జరిమానా వేస్తారు తాతా..'' చెప్పాడు రమేష్.

''పోతే పోనియ్యి బాబూ..శ్రమ తగ్గుతుంది. గొలుసు లాగండి. బాబూ'' ఏడుపుగొంతుతో అన్నాడు వృద్ధుడు.

''భలేవాడివి తాతా నువ్వు. ఎన్నాళ్ళైంది లోకం ముఖం చూసి. మద్రాసుకు చెన్నైగా పేరు మార్చారు. భయపడకు. మద్రాసు వెళ్తాంలే.'' నవ్వాడు రాకేష.

ఊపిరి పీల్చుకున్నాడు వృద్ధుడు.

''బతికించారు బాబూ. ముసలాణ్ణి భలే కంగారు పెట్టారు. ఇంతకూ మీరెక్కడిదాకా?'' అడిగాడు వృద్ధుడు కుదురుకుని.

''మేమూ మద్రాసే''

''ఏం పని మీద బాబూ?''

''ఒక ఇంటర్వ్యూకు''

''అలాగా. ఏం చదువుకున్నారు బాబూ?''

''మేమిద్దరం డాక్టర్లం. మద్రాసులో ఒక పెద్ద కార్పొరేట్ హాస్పిటల్లో సర్జన్ పోస్టుకు ఫైనల్ ఇంటర్వ్యూ ఇవాళ. దానికి వెళ్తున్నాం.''

''అబ్బో..మీరిద్దరూ డాక్టర్లా! అయితే నాకేం భయం లేదు. అయినా నాకు తెలవక అడుగుతున్నాను. ఇంత చదువు చదివి ఒకడి కింద పనిచెయ్యడం దేనికి? హాయిగా సొంతంగా ఆస్పత్రి పెట్టుకోవచ్చుగా.''

''ఏం లాభం లేదు తాతా. ఇవాళా రేపు జనం చిన్న హాస్పిటల్స్‌కి రావడం లేదు. పెద్ద నర్సింగ్‌హోమ్‌లు కట్టించాలంటే చాలా ఖర్చౌతుంది. ఖర్మకాలి మొదటొచ్చిన రెండు మూడు కేసులు ఫెయిలైతే అంత హాస్పిటలూ మూసుకోవాల్సిందే.''

''అదీ నిజమే బాబూ. మరి ఈ ఆస్పత్రి?''

''అబ్బో. ఇది చాలా పెద్దహాస్పిటల్. వంద కోట్ల పెట్టుబడి. నాలుగొందలు పడకలు. ఏభై ఎకరాల్లో పదంతస్తుల బిల్డింగ్. అమెరికాలో ఇరవై ఏళ్ళ నుంచీ డాక్టర్లుగా పనిచేస్తున్న పదిమంది కలిసి అమెరికాలో లభించే అన్ని మోడర్న్ ఫెసిలిటీస్‌తో మద్రాసులో పెద్దహాస్పిటల్ కట్టించారు. ఎటువంటి మేజర్ ఆపరేషనైనా అక్కడ చేస్తారు''

''అబ్బా..మరి అంత పెద్ద హాస్పిటల్లో వైద్యం అంటే చాలా ఖరీదుంటుందే.''

''అంతేకదా మరి? కానీ ఈరోజుల్లో లోయర్ క్లాసు వాళ్ళు కూడా కార్పొరేట్ హాస్పిటల్స్ వైపు పరిగెత్తుతున్నారు. ప్రాణాలకు క్లాసుల భేదం లేదు తాతా. ప్రాణం పోతుందంటే ప్రపంచం మొత్తాన్ని అమ్మేసయినా తన ప్రాణం కాపాడుకోవాలనుకుంటాడు మానవుడు''

''అంతేబాబూ. బాగా చెప్పావు'' అన్నాడు వృద్ధుడు.

రకరకాల తినుబండారాలు అమ్మేవాళ్ళు తిరుగుతున్నారు. సమోసాలు వేడిగా ఉన్నాయి. కొన్ని సమోసాలు కొని తినసాగారు డాక్టర్లిద్దరూ.

''తీసుకోతాతా'' రెండు సమోసాలను వృద్ధుడికందించాడు రాకేష.

''వద్దుబాబూ..బయట పదార్థాలు ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి'' అన్నాడు వృద్ధుడు.

''ఇంతకూ ఏం పనిమీద మద్రాసు వెళ్తున్నావు తాతా?'' అడిగాడు రాకేష.

''వారం రోజుల్నుంచీ ఒకటే నలతగా ఉంటున్నది. అక్కడ మా బంధువొకాయనున్నాడు. ఏదైనా మంచి ఆస్పత్రిలో చూపిస్తాను రమ్మంటే మద్రాసెళ్తున్నాను.''

''అలాగ..ఏదీ..నీ చెయ్యి ఒకసారిలా ఇవ్వు'' వృద్ధుడి చెయ్యందుకున్నాడు రాకేష.

నాడి చూస్తూ కళ్ళు మూసుకున్నాడు.

''అంతా నార్మల్ తాతా: నీకు బీపీ, డయాబిటీస్ లాంటివేమైనా ఉన్నాయా?'' అడిగాడు.

''తెలియదు బాబూ'' బదులిచ్చాడు వృద్ధుడు.

''నథింగ్‌టూ వర్రీ. పెద్దతనం వల్ల అలా అనిపిస్తుంది. నీకేజబ్బూ లేదు.''

రమేష్ వంక చూశాడు వృద్ధుడు.

''మీరూ డాక్టరేగా బాబూ..మీరు కూడా చూసి అదే మాట చెబితే నాకు సగం దిగులు తగ్గుతుంది'' అన్నాడు.

''తప్పకుండా తాతా'' వృద్ధుడి చెయ్యందుకున్నాడు రమేష్.


వెంటనే అతని ముఖంలో రంగులు మారాయి.

''సారీ డాక్టర్. ఐ డోన్ట్ అగ్రీ విత్యూ. ఈయనకు నెర్వస్ డిజార్డర్ వున్నది. తాతా. నీకు రాత్రి పదిగంటలకల్లా నిద్రపడుతుందా?'' అడిగాడు రమేష్.

''లేదు బాబూ. ఏ ఒంటిగంటకో కాస్త

కునుకు పడుతుంది.''

''ఐ.సీ. తాతా. ఇదో రకం నరాల జబ్బు దీనికి కొన్ని రకాల డయాగ్నస్టిక్ టెస్టులు చేయించాలి. అపుడుగానీ ఒక నిర్ధారణకు రాలేం. నా మాట విని టెస్టులు చేయించుకో''




''ఏమైనా పెద్ద జబ్బా బాబూ?''

''ప్రాణ ప్రమాదం ఉండకపోవచ్చు. ఏమైనా సరే టెస్ట్ రిపోర్టులు చూసి కానీ చెప్పలేం.''

రాకేష్ అసహనంగా చూశాడు.

''డాక్టర్..మీరు పేషేంటును అనవసరంగా భయపెడుతున్నారని అనిపిస్తున్నది. మీరు చెప్పేంత లేదు.'' అన్నాడు.

''అయామ్ సారీ డాక్టర్: పేషెంట్ ముందు మరో డాక్టర్‌తో మీరలా మాట్లాడకూడదు. అయామ్ ఆల్సో ఎ ఫిజిషయన్ అండ్ సర్జన్ లైక్ యూ''కటువుగా అన్నాడు రమేష్.

''తాతా. నీకు అప్పుడప్పుడు కళ్ళు తిరుగుతున్నట్లనిపిస్తుందా?'' అడిగాడు వృద్ధుడిని.

''అవును బాబూ''

''కాళ్ళు చేతులు తిమ్మెర్లెక్కుతుంటాయా?''

''అప్పుడప్పుడు''

రాకేష్ భయపడ్డాడు. రమేష్ డయాగ్నైజ్ చేసినంత త్వరగా తానెందుకు చెయ్యలేకపోయాడు?

రమేష్ అడిగిన వ్యాధి లక్షణాలను వృద్ధుడు బలపరిచాడు. తనలో ఎక్కడ లోపం ఉన్నదో అర్థం కాలేదు.

నెల్లూరు స్టేషన్లో రైలు ఆగింది. మరో అయిదారుగురు బోగీలోకి ఎక్కారు. ఓ పల్లెటూరు వ్యక్తి వృద్ధుడికి ఎదురుగా ఉన్న సింగిల్ సీట్లో కూర్చున్నాడు. అతని కుడిబుగ్గ ఉబ్బెత్తుగా కణితిలా ఉంది.

ఇద్దరు డాక్టర్ల దృష్టి ఆ వ్యక్తి మీదికి మరలింది.

''బుగ్గ మీద ఆ కణితి ఎప్పట్నుంచీ ఉంది పెద్దాయనా?'' అడిగాడు రాకేష్.

ఆ వ్యక్తి సమాధానం చెప్పలేదు. రెండు చేతులు ఆడించాడు. నిముషానికోసారి ఏదో బాధ అనుభవిస్తున్నట్లు కళ్ళు గట్టిగా మూసుకుంటున్నాడు.

డాక్టర్లిద్దరూ పక్కవారికి అర్థం కాకూడదని ఇంగ్లీషులో మాట్లాడుకోసాగారు.

''డాక్టర్...ఆ కణితి చూడండి. దాని సైజును, లక్షణాన్ని చూస్తే అతనికది పుట్టుకతోనే ఉండాలి'' అన్నాడు రమేష్.

''ఎందుకలా అనుకుంటున్నారు?'' మధ్యలోనే ప్రశ్నించాడు రాకేష్.

''కణితి బాగా ముదిరిపోయింది. సర్జరీ అవసరమనిపిస్తోంది''

**ఇలపావులూరి మురళీమోహనరావు**

''కానీ నాకలా అనిపించడం లేదు. అది ఈమధ్యనే వచ్చి ఉండవచ్చు. నా ఉద్దేశ్యంలో అతను ఎక్కడైనా పడ్డప్పుడు పదునైన రాయి ఏదైనా గుచ్చుకుని గట్టి దెబ్బ తగిలి రక్తం గడ్డకట్టి ఉండాలి. అది కాయకట్టి ఉంటుంది. దానివలన అతనికి నష్టమేం లేదు. సర్జరీ దండగ.''

''నో..నో..ఆ కణితి నున్నదనం చూడండి. లోపలేదో నిమ్మకాయ దాచినట్లు లేదూ? నా ఉద్దేశ్యంలో దాన్లో సగభాగం బుగ్గలోపలుండవచ్చు. దాని వలన అతను సరిగ్గా మాట్లాడలేడు.''

''సారీ డాక్టర్ రమేష్. మాట్లాడటానికి దానికీ ఏమీ సంబంధం లేదు. అది కచ్చితంగా పులిపిరి సంబంధం. చిన్న ఆపరేషన్తో ప్రోబ్లెమ్ సాల్వ్ అవుతుంది.''

''ఇట్స్ ఇంపాజిబుల్ డాక్టర్ రాకేష్. బహుశః అది క్యాన్సర్ సంబంధమై ఉంటుంది. క్యాన్సర్‌కు సంబంధించిన ఎగ్జామ్సన్నీ చెయ్యాలి. కనీసం ఒక నెలైనా అబ్జర్వేషన్లో ఉంచాలి. పోస్ట్ ఆపరేషన్ ట్రీట్‌మెంట్ కూడా చాలా జాగ్రత్తగా చెయ్యాలి. ఎ వెరీ కాస్ట్లీ అఫెయిర్''

''మీరు మరీ ఎగ్జాగరేట్ చేస్తున్నట్లున్నారు. కొంతమందికి శరీరంలో నుదురుమీద, చెవుల వెనుక, తలమధ్యభాగంలో ఇలాంటి గడ్డలుంటాయి. చాలా చిన్న సర్జరీతో తీసెయ్యొచ్చు.'' అన్నాడు రాకేష్.

వృద్ధుడు, ఆ వ్యక్తి వీరి సంభాషణ తమకేమీ పట్టనట్లుగా ప్రకృతిని చూస్తూ గడపసాగారు. రైలు తడ స్టేషన్ దాటింది.

ఇంతలో ఆ వ్యక్తి నోటి నుండి రెండు ఎర్రని చుక్కలు స్రవించాయి. పై కండువాతో తుడుచుకున్నాడతను.

''అయామ్ రైట్. ఇతనికి కచ్చితంగా క్యాన్సరే. రక్తం కూడా కారుతున్నది. బహుశః పన్ను తగిలుంటుంది. ఇతను ట్రీట్‌మెంట్ కోసమే వెళ్తున్నాడేమో? అయిదు గంటల లోపల ఇతనికి ఆపరేషన్ చెయ్యకపోతే ప్రాణానికే ప్రమాదం'' అన్నాడు రమేష్.

''పెద్దాయనా..నీకేమైంది? నొప్పిగా ఉందా?'' అడిగాడు రమేష్.

ఉండమన్నట్లుగా సైగ చేసి వాష్ బేసిన్ వైపు నడిచాడు తను. బుగ్గనున్న కారా కిళ్ళీని తుపుక్కున ఉమ్మేసి నోరు కడుక్కుని సీట్లో కూర్చున్నాడు. ఇపుడతని బుగ్గ అందరి బుగ్గల్లానే నిగనిగలాడుతుంది.

''అంత నొప్పేం ఉండదు బాబూ. కొద్దిగా మంటగా ఉంటుంది'' మామూలుగా చెప్పి మళ్ళీ కిటికీ లోంచి బయటకు చూడసాగాడు. వృద్ధుడు నిద్రలోకి జారుకున్నాడు.

తమ సంభాషణ ఎవరికైనా అర్థమైందేమోనని కంగారు పడి అటు ఇటు చూసి తలలు వంచుకున్నారు డాక్టర్లిద్దరూ.

★ ★ ★

మద్రాసులో-సాటరన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్.

బాత్‌రూమ్‌తో సహా అణువణువూ సెంట్రల్లీ ఎయిర్ కండిషన్డ్ చెయ్యబడింది. పాలమీగడలా మెరిసిపోతున్న ధవళ వస్త్రాలు ధరించి పసిమి వన్నె శరీరాలతో హడావిడిగా తిరుగుతున్న అందమైన నర్సులు, స్మార్ట్‌గా ఉన్న కుర్రడాక్టర్లు, వందలాది మంది ఖరీదైన పేషెంట్లతో క్రిక్కిరిసిపోయి ఉన్నది. ఎవరెందుకు తిరుగుతున్నారో వారికే తెలుసు.

గుడ్ మాణింగ్ డాక్టర్. వెరీ గుడ్ మాణింగ్ సిస్టర్ వంటి పదాలు తరచుగా వినిపిస్తున్నాయి.

స్పెషల్ విజిటర్స్ ఛాంబర్‌లో విశాలమైన సోఫాల్లో కూర్చున్నారు రమేష్, రాకేష్‌లు. ఒక బోయ్ వచ్చి ''సార్ మిమ్మల్నిద్దరినీ రమ్మంటున్నారు'' చెప్పి వెళ్ళిపోయాడు.

మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుకుమార్ ఛాంబర్స్‌లోకి వెళ్ళారిద్దరూ.

ఆ గదిలోని అలంకరణలు చూసి మూర్ఛవచ్చినంత పనైంది ఇద్దరికీ. యాభై లక్షలు ఖరీదు చేస్తుందా గది.

చచ్చి పొరబాటున స్వర్గంలోకి ప్రవేశించామా అని భ్రమ కలిగిందిద్దరికీ.

విశాలమైన టేబుల్ కవతల రెండు లక్జ్యూరియస్ రివాల్వింగ్ ఛెయిర్స్‌లో ఇద్దరు వ్యక్తులు హుందాగా కూర్చున్నారు. ఫుల్ సూట్లో అరవై సంవత్సరాలు దాటినా హేండ్సమ్‌గా ఉన్నారు. ట్రిమ్ చేసిన క్రాపు, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోళ్ళు ధరించారు.

వారిని చూడగానే కొంచెం వణుకొచ్చిందిద్దరికీ.

''గుడ్‌మార్నింగ్ సర్'' అన్నారిద్దరూ.

''ప్లీజ్ టేక్ యువర్ సీట్స్ జెంటిల్మన్'' హుందాగా అన్నాడు సుకుమార్.

ఇద్దరూ కూర్చున్నారు.

''బైదబై..అయామ్ సుకుమార్. యండీ ఆఫ్ ద హాస్పిటల్. హి ఈజ్ మురళి డైరెక్టర్'' పరిచయం చేశారు సుకుమార్.

''వెరీ గ్లాడ్ టు సీ యు సర్స్'' అన్నారు రమేష్ రాకేష్‌లు.

''ఉన్నది ఒకే పోస్టు. దాదాపు రెండు వందల మంది కాండిడేట్స్ వచ్చారు. ఆఫ్టర్ టూ ఇంటర్వ్యూస్ మీరిద్దరూ ఫైనల్ ఇంటర్వ్యూ వరకూ వచ్చారు'' అన్నాడు సుకుమార్.

''థాంక్యూసార్'' అన్నాడు రాకేష్.

''మేము అమెరికాలో దాదాపు పాతికేళ్ళు పని చేశాం. మన దేశస్థులకేదైనా ఉపకారం చెయ్యాలన్న ఆశయంతో వందకోట్ల పెట్టుబడితో ఈ హాస్పిటల్ కట్టించాం. మీ ఫైనల్ ఇంటర్వ్యూ పూర్తయింది. డాక్టర్ రమేష్‌ను అపాయింట్ చేశాం. డాక్టర్ రాకేష్..అయాం సారీ. మీరు మా హాస్పిటల్‌కు సూట్ కారు'' అన్నాడు సుకుమార్.

రమేష్ కళ్ళు మెరిశాయి. రాకేష్ ముఖం మాడింది.

''మేము ఇప్పుడే వచ్చాం. మీరు ఇప్పుడే పిలిచారు. ఇంత వరకు ఒక్క ప్రశ్న అడగలేదు. ఇంటర్వ్యూ ఎప్పుడైంది? ఇది అన్యాయం'' కోపాన్ని అణచుకుంటూ అన్నాడు రాకేష్.

హుందాగా నవ్వాడు సుకుమార్.

''సీ డాక్టర్ రాకేష్. ఈ హాస్పిటల్ వెనుక పాతికేళ్ళ మా అనుభవం, వందకోట్ల పెట్టుబడి, ఎనిమిది బ్యాంకుల ఆర్థిక సాయం ఉన్నాయి. వచ్చిన పేషెంటుకు కేవలం నాడి చూసి ఏమీ భయం లేదని పది రూపాయల మందులు రాసి, పదిరోజుల్లో తగ్గే రోగాన్ని రెండు రోజుల్లో తగ్గించి రోగికి తన వ్యాధి పట్ల భయం లేకుండా చేసి పంపిస్తుంటే ఆరునెలల లోపల మేం దివాలా తీసి మళ్ళీ అమెరికా వెళ్ళిపోవాలి. శరీరంలో ఏ వ్యాధీ లేదని తెలిసినా చాలా భయంకర రోగాలున్నాయని చెప్పి మన హాస్పిటల్లో ఉన్న అని చెకప్సు చేయించి, ఐసీయూలో వారం రోజులైనా ఉంచి ఒక్కో పేషెంటు మీద రోజుకు కనీసం పదివేలైనా వసూలు చెయ్యకపోతే మా పెట్టుబడి తిరిగిరాదు. ఏ రోగమూ లేదని నిజం చెప్పినా పేషెంటు నమ్మడు. పైగా మనకు ఏమీ రాదనుకుంటాడు. దట్స్ వై రాకేష్. మీరేదైనా గవర్నమెంట్ హాస్పిటల్లో ట్రై చెయ్యండి'' ఆగాడు సుకుమార్.

నోరు తెరిచాడు రాకేష్.

''పూర్తి ఆరోగ్యంగా ఉన్నా నెర్వస్ డిజార్డరని చెప్పాలి. మనుషుల్లో వయసును బట్టి సహజంగా కొన్ని డిఫెక్ట్స్ వస్తుంటాయి. వాటిని పట్టుకుని అది రోగలక్షణంగా చెప్పాలి. అరవై దాటిన వారు ఆరేళ్ళ పిల్లల్లా తొమ్మిదింటికే ఆదమరచి నిద్రపోలేరు. దాన్ని ఒక వ్యాధి లక్షణంగా చెబితే వారికి నమ్మకం కుదురుతుంది. బుగ్గమీది కణితిని చూసి క్యాన్సర్‌గా నమ్మించాలి. ఐదు నిముషాల్లో నార్మల్ డెలివరీ అవుతుందని తెలిసినా సిజేరియన్ చేయించాలి. ఆ కెపాసిటీ డాక్టర్ రమేష్‌కుంది. మీ ఫైనల్ ఇంటర్వ్యూలో నాకు అర్థమైందిదే.'' అన్నాడు సుకుమార్.

డాక్టర్లిద్దరికీ ఊపిరి స్తంభించింది.

''ఇంటర్వ్యూ ఎప్పుడు చేశారనడిగారు. ఇంటర్వ్యూ ఒంగోలులో నేనే స్టార్ట్ చేశాను. నెల్లూరులో మా కో-డైరెక్టర్ చేశాడు. మీ సంభాషణ జాగ్రత్తగా విన్నాం. మాకు డాక్టర్ రమేష్ సూటౌతాడని కామన్ డెసిషన్ కొచ్చాం. కార్పొరేట్ ఇంటర్వ్యూస్ ఇలాగే ఉంటాయి డాక్టర్ రాకేష్'' నవ్వుతూ చెప్పాడు సుకుమార్.

రైలులో తాము చూసిన వృద్ధుడు, పెద్దాయనల పోలికలు ఇప్పుడు వారిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి కుర్ర డాక్టర్లకు.

✪

